వంతెనలపై భయం భయం

- శిథిలావస్థకు చేరిన వైనం
- రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- నిర్మాణంపై దృష్టిపెట్టని అధికారులు

నరసాపురం: నరసాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువలపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలి పోతాయో అన్నట్టుగా ఉన్నాయి. ప్రజలు భయం భయంగానే వంతెనలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో కొత్తగా వంతెనలు నిర్మించాల్సిన అవసరం ఉన్నా ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టి పెట్టడంలేదు.

● నరసాపురం - పాలకొల్లు రోడ్డులో ఉన్న మత్స్యపురి వంతెనపై నిత్యం అనేక బస్సులు, లారీలు వెళుతూ ఉంటాయి. మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లాలంటే ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగించాలి. ఈ వంతెనకు 20 ఏళ్ల క్రితం మరమ్మతులు చేశారు. ఇప్పుడీ వంతెనకు ఓ వైపు రిటైనింగ్ వాల్ కూలిపోయింది.

●రైల్వే స్టేషన్ రోడ్డుకు చేరుకోవడానికి ప్రధాన పంట కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది.


పిల్లర్లు పక్కకు వంగిన మత్స్యపురి వంతెన

మేదర్ల బ్రిడ్జిగా పిలిచే ఈ వంతెన ఓ వైపుకు కుంగిపోయింది. నరసాపురం – పాలకొల్లు రోడ్డులో ఇటీవల ట్రాఫిక్ బాగా పెరిగింది. మేదర్ల వంతెనను కొత్తగా బలంగా నిర్మిస్తే కొంతవరకు ట్రాఫిక్‌ను రైల్వేస్టేషన్ రోడ్డు మీదుగా మళ్లించవచ్చు. తద్వారా ట్రాఫిక్ సమస్యతో పాటు పాలకొల్లు రోడ్డులో తరచూ జరిగే ప్రమాదాల సంఖ్యనూ తగ్గించే అవకాశం ఉంది.

●రుస్తుంబాద నుంచి మంగళగుంటపాలెం వెళ్లే దారిలో కాలువపై వంతెన కూడా కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 1500 ఎకరాల ఆయకట్టు రైతులు ప్రతిరోజూ ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న కాలిబాట వంతెన కూడా మరమ్మతులకు నోచుకోకుండా పోయింది.

కొత్త వంతెనల ఊసేలేదు

పట్టణంలో పలు ప్రాంతాల్లో కాలువలపై కొత్త వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఈ వంతెనలకు సంబంధించి కనీసం ప్రతిపాదనలను కూడా అధికారులు ప్రభుత్వానికి పంపించిన దాఖలాలులేవు. నరసాపురం - పాలకొల్లు రోడ్డులో పద్మశ్రీ రైస్ మిల్లు సమీపంలో కాలువపై కాలిబాట వంతెన నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇక్కడ కాలువ గట్టుకు ఆనుకుని సుమారు 150 కుటుంబాల వారు నివసిస్తున్నారు. అలాగే చినమామిడిపల్లిలో పంట కాలువపై రెండు చోట్లా, థామస్ బ్రిడ్జి వద్ద పంట కాలువపై కాలిబాట వంతెనలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికైనా ఈ అంశంపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

శ్రీమన్నారాయణుడికి ముసుగుల ఉత్సవం


ముసుగుల ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ అష్టభుజ లక్ష్మీ నారాయణస్వామి (చినగోపురం) ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు సందర్భంగా ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. సోమవారం ఉదయం అలంకార తిరుమంజనం, మహాపూర్ణాహుతి, వసంతోత్సవము, చక్రవారి, శాత్తుమఱై, వసంతోత్సవం, ధృవమూర్తుల తిరుమంజనం, మధ్యాహ్నం మహాపూర్ణాహుతి, సాయంత్రం ప్రణయ కలహం (ఏడు ముసుగుల ఉత్సవం), దివ్య మంగళ దర్శనం (హారతుల సేవ) పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. మంగళవారం తిరుప్పావడై ఉత్సవంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బిరుదుకోట శంకర్ తెలిపారు.

ఎంఈఓ-2గా గంగాధర శర్మ బాధ్యతలు


గంగాధరశర్మకు శుభాకాంక్షలు చెబుతున్న ఉపాధ్యాయులు

యలమంచిలి: యలమంచిలి ఎంఈఓ-2గా పాలకొల్లు ఎంఈఓ-2 గంగాధరశర్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. యలమంచిలి ఎంఈఓ-2 కృష్ణంరాజు విదేశాలకు వెళ్లడంతో ఆయన స్థానంలో గంగాధరశర్మకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఆయనను యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయ బదిలీలు, ఎంఈఓ కార్యాలయ సమస్యలు వివరిస్తూనే శుభాకాంక్షలు తెలిపారు. వీరిఓ సంఘం జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతి కుమార్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు సంఘ నాయకులు ఎం శరత్ బాబు, బొలిశెట్టి హనుమంతరావు, అడబాల వెంకటేశ్వరరావు, ఎం రాంబాబు, ముద్దల బాపిరాజు, పిండి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఇలపర్రు మాజీ మునసబు మృతి


సూర్యగోపాలరాజు (ఫైల్)

పెనుగొండ: ఇలపర్రు మాజీ మునసబు పెన్మెత్స వెంకట సత్య సూర్య గోపాలరాజు (95) సోమవారం ఇలపర్రులో మృతి చెందారు. రెండు పర్యాయాలు ఉత్తమ మునసబు అవార్డులు అందుకున్న ఘనత ఆయనది. దేశభక్తి, దేశ నాయకులపై అభిమానం ఎక్కువగా ఉండడంతో ఇంటి ఆవరణలోనే దేశ నాయకుల విగ్రహాలను ఆయన ఏర్పాటు చేసుకొన్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాలరాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పలువురు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

బాడవలో భగవద్గీతపై ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న దృశ్యం

యలమంచిలి: దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమనే సంగతి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బందారు సత్యనారాయణ కోరారు. మండలంలోని ఏనుగువానిలంక, బాడవ గ్రామాలలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత గురించి త్రైత సిద్ధాంత గ్రంథంలో తెలుసుకోవాలన్నారు. మానవ శరీరం దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉందన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతమన్నారు. భగవద్గీతలో ఉండే కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయటపడి మనిషికి ముక్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, బ్రహ్మజీ, సుబ్బారావు, శేషు, వెంకటేష్, సత్యవతి పాల్గొన్నారు.

విద్యార్థిపై దాడి సిగ్గుచేటు

ఉండి: తిరుపతిలో దళిత ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, న్యాయవాది జి.సుందర్‌కుమార్ ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. దళితులకు కూటమి ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. పోలీసు యంత్రాంగం పౌరులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతను పూర్తిగా విస్మరించిందన్నారు.

దేశాలమ్మ జాతర ప్రారంభం


జాతరలో కిటకిటలాడుతున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మ 53వ జాతర మహోత్సవాలు సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతరలో కళాకారుల నృత్యాలు నిమిత్తం ప్రధాన రహదారిలో 12 స్టేజీలను ఏర్పాటు చేశారు. జాతరను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామల నుంచి భారీ సంఖ్యలో జనం తరలివచ్చారు. రాత్రి 1 గంటకు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. మంగళవారం జాతర మహోత్సవాల్లో భాగంగా పట్టణం పురవీధుల్లో గరగల నృత్యాలతో భారీ ఎత్తున ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నత్తారామేశ్వరంలో బారులు తీరిన భక్తులు

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామం సోమవారం భక్తులతో కళకళలాడిది. వైశాఖ మాసం సప్తమి, నాలుగో సోమవారం పురస్కరించుకుని గోస్తనీ నదీ గర్భంలో వేంచేసియున్న శ్రీసప్తకోటీశ్వర లింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. క్షీరాభిషేకాలు చేశారు. 11 నెలలు పాటు నదీ గర్భం నీటిలో ఉండే ఈ లింగేశ్వరుడు నెలరోజులు పాటు భక్తులు తీసుకొచ్చే క్షీరసాగరంలో మునిగితేలుతూ భక్తులకు దర్శనమిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, జిల్లా భక్తులు తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు సప్త కోటీశ్వరుడినితో పాటు శ్రీ ఉమా లక్ష్మణేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామానికి చెందిన దాత, అన్నదాన నిర్వహణ కమిటీ సభ్యుడు ద్వారంపూడి వీరవెంకట సత్యనారాయణరెడ్డి భక్తులకు పులిహోర, దద్దోజన



సప్తకోటి లింగేశ్వరుడు →
గోస్తనీ ఒడ్డున ఉన్న నందీశ్వరుని లింగం వద్ద భక్తుల సందడి

ప్రసాదం పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు, స్థానిక దాతల సహకారంతో మహాశివరాత్రితో పాటు వైశాఖ మాసం నెలరోజులు ఇక్కడ వచ్చే భక్తులకు అన్నదానం చేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 22న హనుమాన్ జయంతి, 26న ఆఖరి సోమవారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఈఆలయానికి వచ్చి రామలింగేశ్వరుడిని దర్శించుకోనున్నారు.

‘మీకోసం’లో ఫిర్యాదుల వెల్లువ


ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో నరసాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 41 ఫిర్యాదులు అందినట్టు ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. మీకోసం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య విగ్రహ ప్రతిష్ఠ


సిద్ధాంతం సీత లింగేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య విగ్రహ ప్రతిష్ఠ

పెనుగొండ: సిద్ధాంతం సీత లింగేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య విగ్రహ ప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లొల్ల బట్టు కేదారేశ్వర రాజు దంపతులచే కాల్దారి సుబ్రహ్మణ్యం వేద మంత్రోచ్ఛరణలో నాగబంధ ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ప్రసాద వితరణ చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

ఆక్వా సాగు విరామానికి సంఘీభావం

యలమంచిలి: ఆక్వా ఫీడ్ ధరల నియంత్రణతో పాటు ప్రాసెసింగ్ యూనిట్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి జూలై నుంచి ఆక్వా సాగుకు విరామం ప్రకటించాలని నిర్ణయించామని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. చించినాడలో సోమవారం నిర్వహించిన ఆక్వా రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలి ధరలతో పాటు ఫీడ్ ధరలు గణనీయంగా పెరగడం, రొయ్యల ధరలను సిండికేట్లు భారీగా తగ్గించి కొనుగోలు చేస్తుండటంతో ఆక్వా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సిండికేట్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయకపోతే ఆక్వా రైతులు ఆర్థికంగా తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. ఈ సమస్యకు క్రాప్ హాలిడే ప్రకటించడం ఒకటే


సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్‌రాజు

సరైన పరిష్కారమని వివరించారు. జూలై నుంచి ఆక్వా సాగును నిలిపివేయాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం నిర్ణయించిందన్నారు. దీనికి రైతులు మద్దతు తెలిపాలని ఆయన కోరారు. సమావేశానికి హాజరైన రైతులంతా సంఘీభావం తెలిపారు.

ఘనంగా మేడపాడు అమ్మవార్ల జాతర ఉత్సవాలు


వెంకమ్మవారు


కనకదుర్గమ్మవారు


జువ్వాలమ్మవారు

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో జాతర నిర్వహించారు. 17వ తేదీన రాత్రి బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేశారు. ఆదివారం నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవార్లను దర్శించుకుని చలవిడి, పానకాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ నెల 25న మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహించడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవార్ల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

22న శ్రీ హనుమాన్ శోభాయాత్ర

యలమంచిలి: విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 22న మండలంలో నిర్వహించే శ్రీ హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ జిల్లా ఇన్‌చార్జి ముత్యాల సత్యనారాయణ (చంటి) ప్రజలను కోరారు. బాడవ గ్రామంలో సోమవారం నిర్వహించిన భజరంగ్ దళ్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్ర గురువారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు చించినాడ బైపాస్ రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రారంభమై యలమంచిలి, ఆర్యపేట, మేడపాడు, శిరగాలపల్లి, కట్టుపాలెం, కాంభొట్లపాలెం, గుంపర్రు, ఇలపకుర్రు మీదుగా దొడ్డిపట్ల సెంటర్‌కు చేరుకుని అక్కడ ముగుస్తుందని


శోభాయాత్ర పోస్టర్ విడుదల చేసిన సభ్యులు

తెలిపారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ సభ్యులు ఇనుకొండ శివ, కొండేటి బద్రి, గెల్లు సాయి, కొండేటి మణికంత, గెల్లు అనిల్, రావూరి దుర్గారావు, రావూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

పాలకొల్లు సెంట్రల్: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకిచ్చే ఘననివాళి అని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. సుందరయ్య 40వ వర్థంతి సందర్భంగా సోమవారం సీపీఎం స్థానిక కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో పార్టీ నిర్మాణానికి సుందరయ్య ఎంతో కృషి చేశారన్నారు. దళితుల అంటరానితనానికి వ్యతిరేకంగా పనిచేశారని వ్యవసాయ, కర్షక, కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీనివాస్, చల్లా సోమేశ్వరరావు, వై అజయ్‌కుమార్, తిరుమాని శ్రీనివాస్, గుబ్బల సత్యనారాయణ, ఎస్ పురుషోత్తం, యాకల రాములు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పి.మోహనరావు అన్నారు. సోమవారం ప్రజా సంఘాల కార్యాలయంలో సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, రోగులకు బ్రెడ్లు పంచారు. ఆచంట, కొడమంచిలి, వల్లూరు, ఆచంట వేమవరం గ్రామాల్లోనూ సుందరయ్య వర్ధంతి కార్యక్రాలు నిర్వహించారు. సహకార పరపతి సంఘ జిల్లా అధ్యక్షుడు పారుపల్లి ఏసురత్నం సాయంతో బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, డాక్టర్ శివరంజని, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ యశ్వంత్, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, ఇందుకూరి సూర్యనారాయణ రాజు, జోగి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు, రొక్కాల దేవదాసులు పాల్గొన్నారు.


ఆచంట సీహెచ్‌సీలో రోగులకు బ్రెడ్ పంచుతున్న నాయకులు


చించినాడలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సుందరయ్యకు ఘన నివాళి

యలమంచిలి: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్ర పటానికి యూటీఎఫ్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. చించినాడ గ్రామంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్ మాట్లాడుతూ నేటి తరమంతా సుందరయ్యలోని నిరాడంబరతను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం మండల శాఖ అధ్యక్షుడు గుత్తిందీవి శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు దేవ సుధాకర్, జయప్రభ, ముద్దల బాపిరాజు, అడబాల వెంకటేశ్వరరావు, పిండి శ్రీనివాసరావు, ఎం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎండ కాస్తే దుమ్ము.. వాన వస్తే బురద

నౌడూరు – పాలమూరు రోడ్డు తీరు

పెనుమంట్ర: పెనుమంట్ర – వీరవాసరం ఆర్‌అండ్‌బీ రహదారిలో నౌడూరు – పాలమూరు మధ్య ఉన్న 60 మీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రోడ్డుకు ఇరువైపులా షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉండటంతో ప్రయాణికులతో పాటు వ్యాపార అవసరాల కోసం ఆప్రాంతానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండకాస్తే దుమ్ము, వానకురిస్తే బురదమయంగా మారే ఈరోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. పాలమూరు నుంచి నౌడూరు సెంటర్ వరకు సుమారు కిలో మీటరు పొడవునా ఉన్న ఈ రోడ్డుకి వైఎస్సార్ సీపీ హయాంలో నిధులు మంజూరు చేసి, పాలమూరు నుంచి కొంతభాగం సీసీ రోడ్డుగా, తదుపరి కొంత భాగం బీటీ రోడ్డుగా నిర్మించారు. అనంతరం ఎన్నికలు రావడంతో ఈ 60 మీటర్లు పొడవు ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. తదుపరి వచ్చిన ప్రభుత్వం రోడ్డుకు కనీస మరమ్మతులు కూడా చేయకపోవడం . ఆరు నెలలుగా సీసీ రోడ్డు నిర్మిస్తామని చెబుతున్న అధికారులు నేటికి పనులు ప్రారంభించకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


నౌడూరు పాలమూరు షాంపింగ్ కాంప్లెక్స్ వద్ద బురదమయంగా మారిన రోడ్డు

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

నరసాపురం: స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. సోమవారం పిల్లలకు నీటి కథలు చెప్పారు. అధ్యాపకులు తెలుగు పద్యాలు చదివించారు. తెలుగు టు ఇంగ్లిష్ ట్రాన్స్‌లేషన్, యోగ, చెస్ వంటి ఆటలు నేర్పించారు. రోజురోజుకు శిబిరానికి వచ్చే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి తెలిపారు. రిటైర్డ్ శాస్త్రవేత్త ఆర్ సుబ్బారావు, స్కూల్ అసిస్టెంట్ రెల్లి శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: ప్రతి ఒక్కరూ మాతృదేశాన్ని ప్రేమించాలని మాతృదేశం గౌరవం పెంపొందేలా ప్రతీ విద్యార్థి తనవంతు ప్రయత్నం చేయాలని నిడదవోలు రిటైర్డ్ ఎంఈఓ వై పైడియ్య అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతికథలు, దేశ భక్తి గీతాలు, యోగా వాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పైడియ్య మాట్లాడుతూ దేశమును ప్రేమించుమన్న అని గురజాడ అప్పారావు రచించిన దేశభక్తి గీతాన్ని రాగయుక్తంగా విద్యార్థులకు వివరించారు. వేసవిలో శీతల పానీయాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జేవీ లక్ష్మణరావు, కేవీవీ సత్యనారాయణ, గ్రంథాలయాధికారిణి వి.శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


కేరమ్స్ ఆడుతున్న విద్యార్థులు

రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు కేసులు

యలమంచిలి: కూటమి పార్టీల నాయకులు తనను రాజకీయంగా ఎదుర్కోలేకే తప్పుడు కేసులు పెడుతున్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది మార్చి 27, 28 తేదీల్లో యలమంచిలి ఎంపీపీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులను లోబరచుకుని ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కూటమి నాయకులు కుటిల ప్రయత్నాలు చేశారని గుర్తుచేశారు. పార్టీ నాయకులతో కలసి వారి కుయుక్తులను భగ్నం చేయడంతో తనపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీపీ ఎన్నికల సమయంలోనే యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో తనపై మూడు కేసులు పెట్టారని తెలిపారు. ఆ కేసులకు హైకోర్టు నుంచి బెయిలు తెచ్చుకున్నట్టు వివరించారు. ఇప్పుడు క్రికెట్ బెట్టింగ్ కేసు తనపై నమోదు చేశారన్నారు. వైజాగ్‌లో దొరికిన బుకీలను పాలకొల్లు తీసుకొచ్చి ఆ కేసులో తన పేరు నమోదు చేశారని తాతాజీ వివరించారు. ఈ కేసులో తనకు 42 అస్తులు ఉన్నట్టు, రూ.23 కోట్లు లావాదేవీలు జరిగినట్టు ఆరోపిస్తూ డీఎస్పీ, అడిషనల్ ఎస్పీ, సీఐలతో మూడు ప్రెస్‌మీట్‌లు పెట్టి చెప్పించారన్నారు. ఇవన్నీ నిరూపించాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా పాలకొల్లులో తన ఆధ్వర్యంలో నడచిన ఆసుపత్రి, కేబుల్ వ్యాపారాలను తప్పుడు ఆరోపణలతో మూసివేయించారని గుర్తుచేశారు. ఇటువంటి కేసులకు, తప్పుడు ఆరోపణలకు తాను భయపడే వ్యక్తిని కాదని పేర్కొన్నారు. న్యాయస్థానంలోనే పోరాటం చేసే నిర్దోషినని నిరూపించుకుంటానని తాతాజీ వివరించారు.

ఉప సర్పంచ్‌గా గన్నాబత్తుల

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సారవ గ్రామ ఉప సర్పంచ్‌గా 10వ వార్డు సభ్యుడు గన్నాబత్తుల కృపారావు ఎన్నికయ్యారు. ఆ పంచాయతీలో సోమవారం ఉప సర్పంచ్ ఎన్నిక ప్రశాంతంగా ఎన్నికల అధికారి జేవీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రూరల్ ఎస్సై టి.వెంకట సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వార్డు సభ్యులు మేడిచర్ల అప్పారావు, బళ్ల శ్రీనివారావు, కార్యదర్శి తిరుమాని రవివర్మ, సర్పంచ్ కైల లావణ్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

23న రాయల్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

నరసాపురం: స్థానిక తెలగ కల్యాణ మండపంలో రాయల్ క్లబ్ కార్యవర్గ సమావేశం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి తెలిపారు. క్లబ్ జాతీయ అధ్యక్షుడు చినిమిల్లి సత్యనారాయణ పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు.